# కౌలు రైతులకు రుణమాఫీ చేయాలి!

# అందరికీ గుర్తింపు కార్డులిచ్చి కొత్త అప్పులివ్వాలి!!

**CPM**

**కౌలు రైతు సోదరులారా !**

అధికారంలోకి వచ్చిన బి.జె.పి, తెలుగుదేశం ప్రభుత్వాలు కౌలు రైతులను అదుకుంటామని, ఆత్మహత్యలను నివారిస్తామని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించాయి. ఆచరణలో ప్రయివేటు వడ్డీ వ్యాపారస్తులనుండి కౌలు రైతులను కాపాడకుండా దగా చేశాయి. ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక మూలన కౌలు రైతు ఆత్మహత్య చేసుకుంటుంటే చోద్యం చూస్తున్నారు. సులభంగా కౌలు గుర్తింపుకార్డులు ఇచ్చి బ్యాంకులనుండి రుణాలు అందించే చర్యలు తీసుకోలేదు.

### నాడు చెప్పిందేమిటి? నేడు చేసిందిమేటి?

ప్రతి కౌలు రైతుకు చట్టం ప్రకారం లక్ష రూపాయలవరకు వడ్డీలేని పంటరుణం ఇస్తామని, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపరిహారాలు, పంటల బీమా సౌకర్యాలు కల్పిస్తామని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినప్పటికీ టిడిపి ప్రభుత్వం ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదు. "ఓడ దాటకముందు ఓడ మల్లయ్య – ఓడ దాటిన తర్వాత బోడి మల్లయ్య" చందంగా చేసిన వాగ్దానాల్ని విస్మరించింది. గతంలో ప్రభుత్వమే ఆర్.ఎం.జి, జె.ఎల్.జి, ఎల్.ఇ.సి కార్డు ఇచ్చి కౌలురైతులకు అప్పులు ఇప్పించింది. కానీ రుణమాఫి పథకంలో వీరి రుణాల్ని మాఫీ చేయలేదు. ఈ రీతిగా అనర్హులుగా ప్రకటించడం చాలా దారుణం. కౌలురైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలి. గిట్టుబాటు ధర రాక, రావలసిన రుణాలు అందక, కౌలు రేట్లు పెరిగి వ్యవసాయం భారంగా మారింది. ప్రతి ఏటా పెరిగే రుణభారం ప్రకృతి ఒడిదుడుకులో తట్టుకోలేని కౌలురైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు. కౌలు రైతులకు మనోధైర్యం కల్గించి నిలదొక్కుకొనేలా ప్రభుత్వ చర్యలు లేవు. బాబుగారు విదేశీ పర్యటనల మోజులో కౌలు రైతులను అదుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

### కౌలు చట్టం ఉన్నా అమలు సున్నా

భూ అధీకృత లైసెన్స్ సాగుదార్ల చట్టం 2011 ప్రకారం పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వాలి. దీంతోపాటు పంట నష్ట పరిహారాలు కూడా వీరికే చెల్లించాలి. "అన్నీ వున్నా అల్లుడినోట్ల శని ఉన్నట్లు" కౌలురైతులకు రాష్ట్ర ప్రభుత్వ విధానం శనిలాగ దాపురించింది. ఏ కౌలురైతుకు కూడా పంటల బీమా పథకం అమలుచేయలేదు. ఇన్‌పుట్ సబ్సిడీలు ఇవ్వలేదు. హుదూద్ తుఫాన్ నష్టపరిహారాలు భూయజమానులకే ఇచ్చింది. రాష్ట్రంలో సాగయ్యే భూములలో 70% భూములను 20 లక్షలమంది కౌలు రైతులే సేద్యం చేస్తున్నారు. ఈ సంవత్సరం కేవలం 3 లక్షల 39వేల మందికే రుణాలు ఇస్తామని లక్ష్యంగా నిర్ణయించడం అన్యాయం. అంటే కౌలు రైతుల్లో నూటికి 6గురికి మాత్రమే బ్యాంకు రుణాలిస్తారన్నమాట. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా ఇంత వరకు రుణ ఆర్హత (ఎల్.ఇ.సి) కార్డులు మంజూరు చేయటంలేదు. చట్ట ప్రకారం రాష్ట్రంలోని 20లక్షలమంది కౌలుదార్లకు ఎల్.ఇ.సి కార్డులను తక్షణం మంజూరు చేయాలి. ప్రత్తి, వరి, మొక్కజొన్నలకు గిట్టుబాటు ధర కల్పించకపోగా కనీసం మద్దతు ధరకూడా ప్రభుత్వం ఇవ్వలేదు. నష్టాలపాలైన కౌలురైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే కనీసం ఆ కుటుంబాలకు కూడా సానుభూతి చూపలేదు. కౌలురైతులను బాగుచేసే విధానం ఇదేనా?

### కార్పొరేట్లకు విందు – కౌలురైతు గెంటివేత

ప్రపంచీకరణ నేపధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం 15 లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ సంస్థలకు వివిధ ప్రాజెక్టుల పేర్లతో కట్టబేట్టడానికి నిర్ణయించింది. విజయనగరంలో భోగాపురం, కృష్ణాజిల్లాలో గన్నవరం విమానాశ్రాయల పేరుతో, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో కోస్టల్ కారిడార్, కృష్ణాజిల్లాలో పోర్టుల పేరుతో సాగుభూమిని కార్పోరేట్లకు కట్టబెడుతుంది. దీని వల్ల భూ యాజమానులే కాకుండా ప్రధానంగా కౌలు రైతులు ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇంకోవైపు ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. ఉపాధి పోతున్న కౌలురైతులకు రక్షణేది?

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని సిపియం డిమాండ్ చేస్తోంది. ఆగస్టు 11,12 తేదీలలో జరిగే ఆందోళనలో పాల్గొనాలని **14వ తేదీ జరిగే ధర్నాలో కౌలు రైతులందరూ పాల్గొనాలని సి.పి.యం విజ్ఞప్తి చేస్తున్నది.**

**డిమాండ్స్ :**

1. **ప్రతి కౌలు రైతుకు లక్షరూపాయలు వడ్డీలేని పంట రుణం ఇవ్వాలి.**
2. **జె.ఎల్.జి, రైతు మిత్ర, ఎల్.ఇ.సి కౌలురైతుల రుణ బకాయిలు తక్షణం రద్దు చేయాలి.**
3. **కౌలు రైతులందరికీ ఎల్.ఇ.సి కార్డులను మంజూరు చేయాలి.**
4. **రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణ ప్రణాళికలో 60% కౌలు రైతులకే ఇవ్వాలి.**
5. **పెరిగిన కౌలు రేట్లను తగ్గించటానికి, కౌలురైతులకు రక్షణ కల్పించటానికి తగిన చర్యలు చేపట్టాలి.**
6. **పంట రుణాలతో పాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టానికి కౌలురైతుకే నష్ట పరిహారం అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలి.**
7. **పంటల బీమా, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలు ఇతర రాయితీలన్నీ కౌలు రైతులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.**

తేది : **17.07.2015**

అభివందనములతో...

## భారత కమ్యూనిస్టు పార్టీ ( మార్క్సిస్టు)

**ఆంధ్రప్రదేశ్ కమిటీ**